

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 20.04.2026 | సంపుటి: 3 | సంచిక: 78 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 20.04.2026 | VOLUME : 3 | ISSUE : 78 | PAGES: 8 | COST: 2/- |



విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575




## గవర్నర్‌తో ముఖ్యమంత్రి భేటీ

- విద్యా సంస్కరణలు, మాదకద్రవ్యాల నియంత్రణపై చర్చ

**హైదరాబాద్, ఏప్రిల్ 19:** రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లోక్ భవన్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేమా నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్య అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా విద్యా రంగంలో చేపట్టాల్సిన సంస్కరణలు, యువత భవిష్యత్తును ప్రభావితం చేసే అంశాలు చర్చకు వచ్చాయి. రాబోయే జూన్ 12న ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న


మిగతా 2వ పేజీలో..

# డీలిమిటేషన్ వార్..
## సౌత్‌కు ప్లస్సా? మైనస్సా?

మహిళా బిల్లు, సీట్ల పెంపుపై పార్లమెంట్‌లో బ్రేకులు
హైబ్రీడ్ మోడల్‌తో రేవంత్ చర్చకు తెర
సీఎంపై బీజేపీ ఫుల్ ఫైర్
నార్త్–సౌత్ రాజకీయాలపై మళ్లీ చర్చ
దక్షిణాది భవిష్యత్‌పై పెరుగుతున్న ఆందోళనలు

**న్యూఢిల్లీ/హైదరాబాద్, ఏప్రిల్ 19 :** మహిళా రిజర్వేషన్, లోక్‌సభ సీట్ల పెంపు, డీలిమిటేషన్ అంశాలు దేశ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. పార్లమెంట్‌లో 131వ రాజ్యాంగ

మిగతా 3వ పేజీలో..






## నేడు జగిత్యాలలో ప్రజా ఆశీర్వాద సభ

కేసీఆర్ సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకోనున్న జీవన్ రెడ్డి
భారీగా ఏర్పాట్లు చేసిన బీఆర్ఎస్ శ్రేణులు
భారీగా తరలి రానున్న కార్యకర్తలు...
ఏడాది తర్వాత ప్రజల్లోకి మాజీ సీఎం కేసీఆర్
గులాబీ బాస్ ప్రసంగంపై సర్వత్రా ఆసక్తి

2

# నేడు రైతు భరోసా రెండో విడుత

నిధుల విడుదలకు సిద్ధం
మలి విడుతో 45,11,947 మంది రైతులకు లబ్ధి
రైతుల ఖాతాల్లో జమ కానున్న రూ.5,653 కోట్లు

**తెలంగాణ** రైతులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రెండో విడత రైతు భరోసా నిధుల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 20న సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో సీఎం పాల్గొననున్నారు. ఈ వేదిక నుంచే కంప్యూటర్ బటన్ నొక్కి రైతుల ఖాతాల్లోకి నేరుగా నిధులను జమ

మిగతా 2వ పేజీలో..




# ఆపరేషన్ ఆక్టోపస్ 2.0..



హైదరాబాద్ పోలీస్ భారీ ఆపరేషన్
సైబర్ మోసాల గుట్టు రట్టు
దేశవ్యాప్తంగా 52 మంది అరెస్ట్
అరెస్టయిన వారిలో 32 మంది బ్యాంకు అధికారులు
9 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు

**హైదరాబాద్, ఏప్రిల్ 19 :** దేశవ్యాప్తంగా విస్తరించిన భారీ సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను హైదరాబాద్ పోలీసులు ఛేదించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0' పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భాగంగా 9 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి మొత్తం 52 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో 32 మంది బ్యాంకు అధికారులు ఉండటం కేసు తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా 16 ప్రత్యేక బృందాలు వారం

మిగతా 2వ పేజీలో..

## రిజల్ట్ ఎందుకు తగ్గింది..



ఇంటర్ ఫలితాలపై విద్యాశాఖ ఆగ్రహం
ప్రభుత్వ, మోడల్ కళాశాలల ఫలితాలపై తీవ్ర అసంతృప్తి
145 మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసులు
రాష్ట్ర సగటు కంటే వెనుకబడిన పాఠశాలలు
మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశాలు

2



## బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు..

- 17 మంది మృతి

2

## డబ్బున్న మైనర్ అమ్మాయిలే టార్గెట్..


- ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ట్రాప్..
- ఫోటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్ దందా
- ముఠా గుట్టు రట్టు



3

## భారత్‌కు పొంచి ఉన్న మరో ముప్పు?

- పశ్చిమాసియాలో మరో జలసంధి క్లోజ్..?
- మరో జలసంధిని మూసివేస్తామని హౌతీల వార్నింగ్
- ట్రంప్ చర్యలు ఆపకపోతే కఠిన నిర్ణయం హెచ్చరిక



2



## తెలంగాణ జాగృతిలోకి రాథోడ్ బాపురావు

- బోథ్ మాజీ ఎమ్మెల్యేకు కండువా కప్పి ఆహ్వానించిన కవిత


2

## రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదు

- వడ్ల కొనుగోలులో ఆలస్యం
- మాజీ మంత్రి హరీశ్ రావు
- గుర్రంపోడులో కార్యకర్తలతో సమావేశం



2



## మా హక్కులను కాదనడానికి ట్రంప్ ఎవరు?

- ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఆగ్రహం
- యూరేనియం శుద్ధి మా హక్కు.. ఆంక్షలను అంగీకరించబోం
- యుద్ధం ముగించాలని ఉంది కానీ గౌరవాన్ని వదులుకోం

4

## హైదరాబాద్‌లో ఈదురుగాలులు, వడగళ్ల వాన బీభత్సం

- గాలివానకు నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- సాయంత్రం 7 గంటల వరకు వర్ష సూచన
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

3



2

## చివరి దశలో మేడారం అభివృద్ధి పనులు



## చివరి దశలో మేడారం అభివృద్ధి పనులు

- జాతర దృష్ట్యా శాశ్వత సదుపాయాల విస్తరణ
- భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- రెండో దశ పనులకు భూసేకరణ వేగవంతం
- మంత్రులు పొంగులేటి, సీతక్క

**ములుగు, ఏప్రిల్ 19 :**

ములుగు జిల్లా మేడారం ప్రాంతంలో చేపట్టిన శాశ్వత అభివృద్ధి పనులు తుదిదశకు చేరుకున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి సీతక్క తెలిపారు. జిల్లాలో పర్యటించిన వారు సమ్మక్క, సారలమ్మ వన దేవతలను దర్శించుకుని అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు.
రెండేళ్లకొకసారి జరిగే మహా జాతరను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు మంత్రులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన జాతర నాటికే ఎక్కువ శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరగా ముగించాలని అధికారులకు సూచించారు.
భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలను మెరుగుపరచాలని మంత్రులు ఆదేశించారు. గత జాతరలో ఎదురైన సమస్యలను గుర్తించి పూర్తిగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. సంవత్సరమంతా భక్తులు దర్శనానికి వస్తుండటంతో మౌలిక వసతులను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని తెలిపారు.
రెండో దశ పనుల కోసం మాస్టర్ ప్లాన్ ప్రకారం భూసేకరణను వేగవంతం చేయాలని సూచించారు. భక్తులకు మెరుగైన సేవల కోసం సిబ్బంది నియామకాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. మల్లూరు హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. మేడారం ప్రాంతాన్ని దేశవ్యాప్తంగా ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రులు వెల్లడించారు.

## రిజల్ట్ ఎందుకు తగ్గింది..

- ఇంటర్ ఫలితాలపై విద్యాశాఖ ఆగ్రహం
- ప్రభుత్వ, మోడల్ కళాశాలల ఫలితాలపై తీవ్ర అసంతృప్తి
- 145 మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసులు
- రాష్ట్ర సగటు కంటే వెనుకబడిన పాఠశాలలు
- మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 19 :**

తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర సగటు కంటే తక్కువ ఉత్తీర్ణత నమోదవ్వడంతో విద్యాశాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. ముఖ్యంగా ప్రభుత్వ, మోడల్ కళాశాలల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులపై చర్యలకు సిద్ధమైంది. ఈ క్రమంలో 145 మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.
ఇంటర్ ఫస్టియర్‌లో రాష్ట్ర సగటు ఉత్తీర్ణత 66.20 శాతం, సెకండియర్‌లో 70.58 శాతం నమోదైనా, అనేక మోడల్ స్కూళ్లు ఈ సగటును అందుకోలేకపోయాయి. మొత్తం 194 మోడల్ స్కూళ్లలో ఫస్టియర్‌లో 145, సెకండియర్‌లో 105 పాఠశాలలు తక్కువ ఫలితాలు నమోదు చేయడం విద్యాశాఖను ఆందోళనకు గురిచేసింది.
ఫస్టియర్‌లో వికారాబాద్ జిల్లా బషీరాబాద్‌లో కేవలం 10 శాతం మాత్రమే ఉత్తీర్ణత నమోదు కాగా, నల్గొండ జిల్లా వేములపల్లిలో 10.75 శాతం మాత్రమే నమోదైంది. 82 పాఠశాలల్లో పాస్ శాతం 50 కంటే తక్కువగా ఉండటం గమనార్హం. సెకండియర్‌లో వరంగల్ జిల్లా పర్వతగిరిలో అత్యల్పంగా 20.25 శాతం మాత్రమే పాస్ శాతం నమోదైంది.
ఈ నేపథ్యంలో తక్కువ ఫలితాలకు కారణాలపై వివరణ కోరుతూ సంబంధిత ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ స్పష్టం చేసింది.

## గవర్నర్‌తో ముఖ్యమంత్రి భేటీ

**మొదటిపేజీ తరువాయి**

భారీ అవగాహన కార్యక్రమంపై ముఖ్యమంత్రి గవర్నర్‌కు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల్లో చైతన్యం కల్పించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. సమాజంలో పెరుగుతున్న మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ఈ కార్యక్రమాన్ని పెద్ద ఉద్యమంగా మార్చే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.
గవర్నర్ మాట్లాడుతూ విద్యా సంస్థల్లో మాదకద్రవ్యాల ప్రభావం పెరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. చిన్న వయస్సులోనే విద్యార్థులకు సరైన దిశలో మార్గనిర్దేశం చేయడం అవసరమని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను తెలియజేయాలని సూచించారు. విద్యార్థులతో ప్రమాణ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా బాధ్యతను గుర్తుచేయాలని తెలిపారు. అడ్మిషన్ల సమయంలోనే మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రమాణపత్రం తీసుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి ఈ సూచనలను పరిశీలించి అమలు చేస్తామని తెలిపారు. విద్యా సంస్థల్లో కట్టుదిట్టమైన నిబంధనలు అమలు చేసి మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు చెప్పారు. పోలీసు, విద్యా శాఖల మధ్య సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి విద్యార్థికి సురక్షిత వాతావరణం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

## బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు..

- 17 మంది మృతి

**విరుద్‌నగర్,ఏప్రిల్ 19**



తమిళనాడులో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. విరుద్‌నగర్ జిల్లా లోని ఓ బాణసంచా పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 17 మంది మృతిచెందారు. పలువురు గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.
ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఇంకా భారీగా మంటలు ఎగసిపడుతున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.
ఈ ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

# నేడు జగిత్యాలలో ప్రజా ఆశీర్వాద సభ

- కేసిఆర్ సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకోనున్న జీవన్ రెడ్డి.
- భారీగా ఏర్పాట్లు చేసిన బీఆర్ఎస్ శ్రేణులు
- భారీగా తరలి రానున్న కార్యకర్తలు...
- ఏడాది తర్వాత ప్రజల్లోకి మాజీ సీఎం కేసీఆర్
- గులాబీ బాస్ ప్రసంగంపై సర్వత్రా ఆసక్తి

**జగిత్యాల, ఏప్రిల్ 19 :**



బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్ర శేఖర్ రావు బహిరంగ సభకు సర్వం సిద్ధమైంది. దాదాపు ఏడాది కాలం తర్వాత కేసీఆర్ ప్రజల ముందుకు వస్తుండటంతో, ఈ ప్రజా ఆశీర్వాద సభ పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. జగిత్యాల నియోజకవర్గ రాజకీయ సమీకరణాల్లో పలు మార్పులు చోటు చేసుకోబోతున్న ఈ సభ కేవలం రాజకీయ ప్రసంగాలకే పరిమితం కాకుండా, కీలక చేరికలకు వేదిక కానుంది. సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అధికారికంగా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోనున్నారు. కేసీఆర్ స్వయంగా ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించనున్నారు. ఇది ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు సంకేతంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యేలు సంజయ్, కౌశిక్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి తదితరులు తో కలిసి రెండు సార్లు పర్యవేక్షించారు. సభకు వచ్చే కార్యకర్తలకు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు సమకూర్చారు.

**కేసిఆర్ సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకోనున్న జీవన్ రెడ్డి....**

కాంగ్రెస్ కు రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్‌రెడ్డి నేడు మాజీ సీఎం కేసిఆర్ సమక్షంలో గూలాబీ తీర్థం పుచ్చుకోనున్నారు. జీవన్ రెడ్డి బిఆర్ఎస్ చేరడంతో రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జీవన్‌రెడ్డికి జగిత్యాల జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణలో పలు నియోజకవర్గాల్లో పట్టు ఉండడంతో ఆయన బిఆర్ఎస్లో చేరడం ఆ పార్టీకి కలసి వస్తుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే సీఎం రేవంత్రెడ్డిపై ఆరోపణలు చేస్తున్న జీవన్ రెడ్డి, బిఆర్ఎ స్లో చేరిన అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్రెడ్డిని తనదైన శైలిలో ఇరుకున పెడుతూ, తన స్వరాన్ని మరింతా పెంచుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, తెలంగాణ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పై బిఆర్ఎస్ శ్రేణులతో కలసి పోరాటం చేయనున్నారు.

**భారీగా తరలి రానున్న కార్యకర్తలు...**

జగిత్యాలలో నేడు జరగనున్న బిఆర్ఎస్ బహిరంగసభకు బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ రానుండటంతో జగిత్యాల జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన బిఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అభిమానులు భారీగా తరలిరానున్నారు. ప్రజలు భారీగా తరలిరానున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు బిఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

**కేసిఆర్ ప్రసంగంపై సర్వత్రా ఆసక్తి....**

చాలా కాలం తర్వాత బహిరంగ సభ ద్వారా ప్రజల మధ్యలోకి వస్తున్న మాజీ సీఎం కేసీఆర్ ఏం మాట్లాడుతారోనని రాష్ట్ర ప్రజలు, బిఆర్ఎస్ శ్రేణులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎలాంటి విమర్శలు చేస్తారు? హామీల అమలుపై సర్కారును ఎలా నిలదీస్తారు? అన్నది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్గా మారింది. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, హామీలు, రెండున్నరేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, ముఖ్యంగా రాష్ట్ర రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులపై కేసీఆర్ మాట్లాడే అవకాశం ఉంది.

## రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదు

- వడ్ల కొనుగోలులో ఆలస్యం
- మాజీ మంత్రి హరీశ్ రావు
- గుర్రంపోడులో కార్యకర్తలతో సమావేశం

**నాగార్జున సాగర్, ఏప్రిల్ 19:**



రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని గుర్రంపోడు మండలంలో నిర్వహించిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాల్లో 11 స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకున్నప్పటికీ రైతులకు కనీస సాయం అందడం లేదని విమర్శించారు. ముఖ్యమైన మంత్రులు ఉన్నా వడ్ల కొనుగోలు సకాలంలో జరగకపోవడం దురదృష్టకరమని తెలిపారు. రైతులు తమ పంటను అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మండుటెండలో రైతులు ఐకేపీ కేంద్రాల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. 46 డిగ్రీల ఎండలో కూడా రైతులు పడిగాపులు కాస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ఆరోపించారు. నల్గొండ జిల్లాకు చెందిన మంత్రులు కూడా రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. వారు ప్రయాణాల్లోనే గడుపుతున్నారని, రైతుల కష్టాలను అర్థం చేసుకునే పరిస్థితి లేదని విమర్శించారు. రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని తెలిపారు. పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. కార్యకర్తలను వేధిస్తే సహించబోమని హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పార్టీ శ్రేణులు ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతుల సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని హరీష్ రావు తెలిపారు.



## తెలంగాణ జాగృతిలోకి రాథోడ్ బాపురావు

- బోథ్ మాజీ ఎమ్మెల్యేకు కండువా కప్పి ఆహ్వానించిన కవిత

**హైదరాబాద్, ఏప్రిల్ 19:**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును జాగృతిలోకి ఆహ్వానించారు. కండువా కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక జిల్లాల నుంచి నాయకులు కొత్త రాజకీయ వేదికలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 2006లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వారం రోజుల పాటు ప్రజలతో కలిసి వైద్య శిబిరాలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఉద్యమ సమయంలో ప్రజలతో కలిసిన అనుభవం తనకు ప్రేరణనిచ్చిందని తెలిపారు.
రాథోడ్ బాపురావు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకుడని పేర్కొన్నారు. ఉద్యోగాన్ని వదిలి ఉద్యమంలో పాల్గొని రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలవడం ఆయన సేవలకు నిదర్శనమని తెలిపారు.
తెలంగాణలో ఉన్న ఉద్యమకారులు కొత్త రాజకీయ వేదిక వైపు చూస్తున్నారని అభిప్రాయపడ్డారు. గతంలో తెలంగాణ సాధన కోసం ఏకమై పనిచేసినట్లే, ఇప్పుడు రాష్ట్ర అభివృద్ధి కోసం కూడా కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. రాథోడ్ బాపురావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే మంచి రోజులు వస్తాయని నమ్మి ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజా సేవలోకి వచ్చినట్లు తెలిపారు. కవిత ఇచ్చిన ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి అడుగుపెట్టానని తెలిపారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా తర్వాత తగిన ప్రాధాన్యత దక్కలేదని పేర్కొన్నారు. కవిత నాయకత్వంలో కొత్త రాజకీయ వేదికలో చేరుతున్నట్లు ప్రకటించారు. తెలంగాణకు మహిళా ముఖ్యమంత్రి కావాలనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. త్వరలో పెద్ద సభ ఏర్పాటు చేసి మరింత మంది కార్యకర్తలను ఈ వేదికలో చేర్పించనున్నట్లు వెల్లడించారు.

# ‘ఆపరేషన్ ఆక్టోపస్ 2.0’..

**మొదిపేజీ తరువాయి**




రోజుల పాటు మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్ రాష్ట్రాల్లో సమన్వయంతో దాడులు నిర్వహించాయి. అరెస్టయిన వారిలో సైబర్ నేరగాళ్లకు సహకరించిన 32 మంది బ్యాంకు సిబ్బంది ఉండగా, అక్రమ లావాదేవీల కోసం తమ ఖాతాలను ఉపయోగించుకునేందుకు అనుమతించిన 15 మంది మ్యూల్ ఖాతాదారులు, అలాగే ఈ ఖాతాలను నేరగాళ్లకు అందించిన ఐదుగురు మధ్యవర్తులు ఉన్నారు.
దర్యాప్తులో భాగంగా పలు ప్రైవేట్ బ్యాంకులకు చెందిన అధికారుల ప్రమేయం వెలుగులోకి వచ్చింది. ఇండస్‌ఇండ్ బ్యాంక్, బంధన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఫెడరల్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లకు చెందిన పలువురు అధికారులు అరెస్టయ్యారు. నిందితుల నుంచి 26 మొబైల్ ఫోన్లు, 14 చెక్ బుక్కులు, ఒక ల్యాప్‌టాప్, 21 షెల్ కంపెనీల స్టాంపులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
పెట్టుబడి మోసాలు, ట్రేడింగ్ ఫ్రాడ్స్, ‘డిజిటల్ అరెస్ట్’ వంటి సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు సజ్జనార్ తెలిపారు. ఫిబ్రవరి 2026లో నిర్వహించిన ‘ఆపరేషన్ ఆక్టోపస్1’లో రూ.150 కోట్ల లావాదేవీలకు సంబంధించి 117 మందిని అరెస్ట్ చేసినట్లు గుర్తుచేశారు. అదే దర్యాప్తుకు కొనసాగింపుగా ఈసారి బ్యాంకు అధికారుల పాత్రపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు.
సరైన కేవైసీ ధృవీకరణ లేకుండా మ్యూల్ ఖాతాలు తెరవడం సైబర్ నేరాలకు ప్రధాన కారణమవుతోందని పోలీసులు పేర్కొన్నారు. ప్రైవేట్ బ్యాంకుల నిర్లక్ష్యం, కొందరు అధికారుల సహకారం వల్లే ఈ మోసాలు విస్తరించాయని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి నేరాలపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## భారత్‌కు పొంచి ఉన్న మరో ముప్పు?

- పశ్చిమాసియాలో మరో జలసంధి క్లోజ్..?
- మరో జలసంధిని మూసివేస్తామని హౌతీల వార్నింగ్
- ట్రంప్ చర్యలు ఆపకపోతే కఠిన నిర్ణయం హెచ్చరిక

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 19 :**



పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో భారత్ సహా ప్రపంచ దేశాలకు మరో ముప్పు పొంచి ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే హర్మూజ్ జలసంధి మూసివేతతో చమురు సరఫరాలపై ప్రభావం పడగా, ఇప్పుడు మరో కీలక జలసంధిని కూడా మూసివేస్తామని హౌతీలు హెచ్చరించడం కలకలం రేపుతోంది. ప్రపంచ శాంతికి విఘాతం కలిగించే చర్యలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెంటనే మానుకోవాలని హౌతీలు సూచించారు. లేకపోతే సూయజ్ కాలువకు కీలక మార్గమైన బాబ్ అల్ మాండెబ్ జలసంధిని క్లోజ్ చేస్తామని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం తీసుకుంటే దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని పేర్కొన్నారు. ఒక్కసారి బాబ్ అల్ మాండెబ్ జలసంధిని మూసివేస్తే తిరిగి తెరిపించడం ప్రపంచంలోని ఏ ఒక్కరికి సాధ్యం కాదని హౌతీ మంత్రి హుస్సేన్ వెల్లడించారు. ఈ హెచ్చరికలతో అంతర్జాతీయ వాణిజ్యం, చమురు రవాణాపై భారీ ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానించే ఈ జలసంధి ప్రపంచ వాణిజ్యానికి కీలక మార్గం. ముఖ్యంగా భారత్ సహా అనేక దేశాలకు చమురు సరఫరాలు ఈ మార్గంపైనే ఆధారపడటం వల్ల, పరిస్థితులు మరింత దిగజారితే ఆర్థిక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## నేడు రైతు భరోసా రెండో విడుత

**మొదటిపేజీ తరువాయి**

చేయనున్నారు. రెండో విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 45 లక్షల 11 వేల 947 మంది రైతులకు లబ్ధి కలగనుంది. ఈ విడతలో మొత్తం 5వేల 653 కోట్ల నిధులను ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేయనుంది. ఎకరానికి 6వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. రాష్ట్రంలోని 1.50 కోట్ల ఎకరాలకు పెట్టుబడి సాయం అందిస్తోంది సర్కార్. తొలి విడతగా ఇప్పటికే 3వేల 590 కోట్లు అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు.



## డబ్బున్న మైనర్ అమ్మాయిలే టార్గెట్..

- ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ట్రాప్..
- ఫోటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్ దందా
- ముఠా గుట్టు రట్టు

**హైదరాబాద్, ఏప్రిల్ 19 :**

డబ్బున్న మైనర్ బాలికలను లక్ష్యంగా చేసుకుని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ట్రాప్ చేసి, తర్వాత ఫోటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తూ లక్షల రూపాయలు వసూలు చేస్తున్న ముఠా గుట్టును జూబ్లీహిల్స్ పోలీసులు రట్టు చేశారు.

ఇన్‌స్టాగ్రామ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించిన ఈ గ్యాంగ్, విదేశాల్లో ఉన్న తల్లిదండ్రుల పిల్లలను టార్గెట్ చేసిందని పోలీసులు తెలిపారు. ప్రముఖ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థినులపై నిఘా పెట్టి, సోషల్ మీడియాలో పబ్బుల్లో తిరిగినట్లు పోస్టులు చేస్తూ నమ్మకం కల్పించి మోసం చేసినట్లు వెల్లడించారు.

హైదరాబాద్‌లోని పబ్బుల్లో తిరుగుతూ మైనర్లతో పరిచయాలు పెంచుకుని, తర్వాత వారితో ఫోటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్‌కు దిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ వీడియోలను అడ్డంగా పెట్టుకుని లక్షల రూపాయలు వసూలు చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు.

ఇదే క్రమంలో ఓ పారిశ్రామికవేత్త కూతురిని ట్రాప్ చేసి భారీగా డబ్బులు గుంజినట్లు పోలీసులు వెల్లడించారు. ఇంటి పని చేసే వారి ద్వారా మైనర్ బాలికల కదలికలపై నిఘా పెట్టినట్లు గుర్తించినట్లు తెలిపారు.

ఈ కేసులో కీలక నిందితుడు అర్జున్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. షీ టీమ్స్ చర్యలతో ఈ ముఠా కార్యకలాపాలు వెలుగులోకి వచ్చినట్లు వెల్లడించారు.



## హైదరాబాద్‌లో ఈదురుగాలులు, వడగళ్ల వాన బీభత్సం

- గాలివానకు నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- నగరంలోని పలు ప్రాంతాల్లో వడగండ్ల వాన ప్రభావం
- సాయంత్రం 7 గంటల వరకు వర్ష సూచన
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

**హైదరాబాద్, ఏప్రిల్ 19 :**

హైదరాబాద్ నగరంలో ఆదివారం వాతావరణం ఒక్కసారిగా మారిపోయి ఈదురుగాలులు, వడగళ్ల వాన బీభత్సం సృష్టించాయి. మధ్యాహ్నం తర్వాత ఆకస్మికంగా మేఘావృతమైన ఆకాశం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాన్ని కురిపించింది. నగరంలోని అనేక ప్రాంతాల్లో వడగండ్లు పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఈదురుగాలుల ధాటికి చింతల్, పద్మనగర్ ప్రాంతాల్లో భారీ చెట్లు వేర్లతో సహా కూలిపోయాయి. దీంతో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనలో పలు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. అయితే ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, సికింద్రాబాద్, జీడిమెట్ల, కొంపల్లి, దుండిగల్, నిజాంపేట, బాలానగర్ తదితర ప్రాంతాల్లో వడగండ్ల వాన తీవ్రంగా కురిసింది.

వాతావరణ శాఖ ప్రకారం హైదరాబాద్‌లో సాయంత్రం 7 గంటల వరకు వర్షం కొనసాగే అవకాశం ఉంది. మరోవైపు మేడ్చల్‌మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. అదిలాబాద్, నిర్మల్, వికారాబాద్ వంటి జిల్లాలకు యెల్లో అలర్ట్ ప్రకటించారు.

వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని హెచ్చరించారు. భారీ గాలులు, వర్షాల కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలే ప్రమాదం ఉండటంతో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## తీవ్ర విషాదం..

- ఈతకు వెళ్లి విగతజీవులుగా మారిన విద్యార్థులు..

**మేడ్చల్-మల్కాజిగిరి :**

ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధి డబిల్‌పూర్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఈతకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామానికి చెందిన ఉమన్ (14) 9వ తరగతి చదువుతున్నాడు. మరో బాలుడు ఇర్ఫాన్(12) 7వ తరగతి విద్యార్థి. ఒంటిపూట బడులు కావడంతో వీరిద్దరూ సరదాగా ఆడుకునేందుకు ఇవాళ(ఆదివారం) మధ్యాహ్న సమయంలో కలిశారు. అనంతరం సరదాగా ఈత కొట్టాలని నిర్ణయించుకున్నారు. ఎవరికీ చెప్పకుండా ఇస్కాన్ టెంపుల్ పక్కనున్న చెరువు వద్దకు వెళ్లారు. స్నానం చేసేందుకు మెల్లిగా లోపలికి దిగారు. లోతును సరిగా అంచనా వేయలేకపోవడంతో మునిగిపోయారు. ప్రాణాలు రక్షించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కాపాడాలంటూ హాహాకారాలు చేశారు. అయితే, సమీప ప్రాంతంలో ఎవ్వరూ లేకపోవడంతో చివరికి నీటిలో మునిగి ఉమన్, ఇర్ఫాన్ మృతిచెందారు.

అటుగా వెళ్లిన రైతులు, రైతు కూలీలు వారిని గుర్తించి విషయాన్ని గ్రామస్థులకు చేరవేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకుని ఉమన్, ఇర్ఫాన్ మృతదేహాలను వెలికితీశారు పోలీసులు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గ్రామస్థులు, మృతుల కుటుంబసభ్యులు చెరువు వద్దకు చేరుకుని కన్నీటిపర్యంతం అయ్యారు. చిన్నారుల తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించారు. ఈ ఘటనతో డబిల్‌పూర్‌లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.



# డీలిమిటేషన్ వార్..
# సౌత్‌కు ప్లస్సా? మైనస్సా?

**మొదటిపేజీ తరువాయి**

సవరణ బిల్లుకు అవసరమైన మెజారిటీ రాకపోవడంతో ఈ కీలక బిల్లులు నిలిచిపోయాయి. దీంతో మహిళా రిజర్వేషన్ అమలు నిలిచిపోగా, డీలిమిటేషన్ ప్రక్రియకు కూడా తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి. ఈ పరిణామాల మధ్య 'హైబ్రీడ్ మోడల్'ను ముందుకు తెచ్చిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చుట్టూ రాజకీయ దుమారం చెలరేగింది.

బిల్లులు వీగిపోవడంతో రాజకీయ పార్టీల మధ్య బ్లేమ్ గేమ్ మొదలైంది. డీలిమిటేషన్ పేరుతో దేశాన్ని ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించే కుట్ర జరుగుతోందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లును ముందుకు తెచ్చి అసలు అజెండాను దాచేందుకు కేంద్రం ప్రయత్నించిందని విమర్శిస్తోంది. మరోవైపు, మహిళా బిల్లును అడ్డుకోవడం ద్వారా విపక్షాలు చారిత్రాత్మక తప్పు చేశాయని ఎన్డీయే పక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.

ఇక సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రీడ్ మోడల్ దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. జనాభా ప్రాతిపదికతో పాటు ఇతర అంశాలను కలిపి సీట్ల పునర్విభజన జరగాలన్న ఆలోచనను ఆయన ముందుకు తెచ్చారు. పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వ విధానాలకు చెక్ పెట్టామని కాంగ్రెస్ చెబుతుండగా, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే తీసుకొచ్చిన ప్రతిపాదన అని బీజేపీ విమర్శిస్తోంది.


డీలిమిటేషన్ జరిగితే తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 119 నుంచి 150 దాటే అవకాశం ఉందని, పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 26 వరకు పెరిగే అవకాశం ఉండేదని విశ్లేషణలు చెబుతున్నాయి. అయితే హైబ్రీడ్ మోడల్ వల్ల పెద్దగా మార్పులు రావని, గరిష్టంగా ఒకటి రెండు సీట్లకే పరిమితం అవుతుందని బీజేపీ వాదిస్తోంది. ఈ నేపథ్యంలో రేవంత్ చర్యలు కాంగ్రెస్‌లో హైప్ కోసం మాత్రమేనని ఆరోపిస్తోంది.

దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ వల్ల నష్టం జరుగుతుందన్న భయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. 2026 జనాభా లెక్కల ఆధారంగా సీట్ల పునర్విభజన జరిగితే ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇదే అంశాన్ని వైసీపీ అధినేత జగన్ కూడా ప్రస్తావిస్తూ దక్షిణాది హక్కులు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు విపక్షాల తీరుతో దేశం ఒక చారిత్రక అవకాశాన్ని కోల్పోయిందని ఏపీ సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

ప్రస్తుతం డీలిమిటేషన్ అంశం పూర్తిగా రాజకీయ ఈక్వేషన్‌గా మారింది. బీజేపీ సీట్ల పెంపు, పునర్విభజనపై ముందుకు సాగాలని చూస్తుండగా, కాంగ్రెస్ నార్త్-సౌత్ సమీకరణాలను ప్రస్తావిస్తూ బ్రేకులు వేస్తోంది. దీంతో సమీప భవిష్యత్తులో డీలిమిటేషన్ అమలు అవుతుందా లేదా అన్నది అనిశ్చితంగా మారింది.

దీంతో అసలు ప్రశ్న ఏమిటంటే—డీలిమిటేషన్ నిలిచిపోవడం దక్షిణాదికి లాభమా? లేక నష్టమా? తక్షణంగా చూస్తే నష్టం తప్పిందని అనిపించినా, దీర్ఘకాలంలో రాజకీయ ప్రాతినిధ్యం, వనరుల పంపిణీపై ప్రభావం పడే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మొత్తంగా పార్లమెంట్ వేదికగా ప్రారంభమైన ఈ డీలిమిటేషన్ వార్ ఇంకా ముగియలేదు. హైబ్రీడ్ మోడల్ చర్చ, నార్త్-సౌత్ రాజకీయాలు, మహిళా రిజర్వేషన్ అన్నీ కలిపి దేశ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తున్నాయి. ఈ రాజకీయ పోరు చివరకు ఎవరికీ లాభం చేకూరుస్తుందో, దక్షిణాది రాష్ట్రాల భవిష్యత్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాల్సి ఉంది.




## మేడ్చల్ జిల్లాలో డ్రగ్స్ దందా గుట్టురట్టు

**మేడ్చల్, ఏప్రిల్ 19:**

మేడ్చల్ జిల్లా మల్లాపూర్ పారిశ్రామిక ప్రాంతంలో నాచారం ఎక్సైజ్ పోలీసులు మెరుపు దాడి జరిపారు. పారిశ్రామిక ప్రాంతాలను, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గంజాయి విక్రయిస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు. మల్లాపూర్ పారిశ్రామిక ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి భారీగా మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

**నిందితుల వివరాలిలా..**

విశ్వసనీయ సమాచారం మేరకు నాచారం ఎక్సైజ్ పోలీసులు మల్లాపూర్‌లో తనిఖీలు చేశారు. ఈ సోదాల్లో ధారావత్ సంతోశ్, సందీప్ అనే ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారు. నిందితుల దగ్గరి నుంచి 1.200 కిలోల పొడి గంజాయి, ఒక హోండా యాక్టివా బైక్, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసిన అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించారు. తదుపరి విచారణ కోసం నిందితులను రిమాండ్‌కు పంపించినట్లు పోలీసులు తెలిపారు.

**వైజాగ్ నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ అక్రమ రవాణా..**

పోలీసుల విచారణలో నిందితులు విస్తుపోయే నిజాలను వెల్లడించారు. వీరు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాల నుంచి తక్కువ ధరకు ఎండు గంజాయిని కొనుగోలు చేసి, గుట్టుచప్పుడు కాకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. భాగ్యనగరంలో గంజాయికి బానిసలైన వారిని గుర్తించి, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారు. మల్లాపూర్ వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేసే కార్మికులు, ముఖ్యంగా కాలేజీ విద్యార్థులే లక్ష్యంగా వీరు తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారని పోలీసులు తెలిపారు.

**పోలీసుల హెచ్చరిక..**

గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తున్నామని నాచారం ఎక్సైజ్ పోలీసులు పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో నిఘా పెంచామని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. ఈ గంజాయి ముఠా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మత్తు పదార్థాల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు కోరారు.



## 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి: కిరణ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 19 :**

మహిళా రిజర్వేషన్ల అమలుకు ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్, ఇండియా కూటమి వ్యతిరేకం కాదని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం సాయంత్రం మహిళల గురించి మాట్లాడారని తెలిపారు. 2027 జనగణన తర్వాత డీలిమిటేషన్ జరగాలని.. కానీ మోదీ తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం 16,17,18 తేదీల్లో ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు పెట్టారని ప్రస్తావించారు. ఈరోజు (ఆదివారం) హైదరాబాద్ వేదికగా మీడియాతో కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు 2023లోనే ఆమోదం పొందిందని తెలిపారు. 2024 తర్వాత మహిళా రిజర్వేషన్లను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

**ఇండియా కూటమిపై బీజేపీ దుష్ప్రచారం..**

543 లోక్‌సభ స్థానాలకు 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని ఇద్దరు లోక్‌సభ సభ్యులు తప్ప అందరూ ఒప్పుకున్నారని కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. 2027 జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పిందే మోదీ, అమిత్ షాలని చెప్పుకొచ్చారు. 33 శాతం రిజర్వేషన్లు ఇప్పుడు అమలు చేసినా తమకు ఇబ్బందేమిలేదని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇండియా కూటమిపై బీజేపీ దుష్ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. తాము మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని.. డీలిమిటేషన్‌కు వ్యతిరేకమని స్పష్టం చేశారు. డీలిమిటేషన్ చేయాలంటే అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

**గత విధానాలను అమలు చేయాలి..**

ఉత్తర భారతం, దక్షిణ భారతం మధ్య అంతరం లేకుండా డీలిమిటేషన్ చేయాలని కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. గతంలో ఇందిరాగాంధీ, వాజ్‌పేయి అనుసరించిన విధానాలను అమలు చేయాలని కోరారు. డీలిమిటేషన్‌ను ఇష్టం వచ్చినట్లుగా చేసుకుని ఎప్పటికీ అధికారంలో ఉండాలని బీజేపీ భావించడంతోనే తాము వ్యతిరేకించామని అన్నారు. బీజేపీ చేసే దుష్ప్రచారాన్ని మహిళలు పట్టించుకోవద్దని సూచించారు. ఎస్ఐఆర్‌ను ఏ విధంగా అమలు చేసి.. వారి ఇష్టం వచ్చినట్లుగా ఎలా ఓట్లు తొలగించారో చూశామని ప్రస్తావించారు. అలాగే, డీలిమిటేషన్ ద్వారా వారి ఇష్టం వచ్చినట్లుగా చేసుకోవాలని మోదీ ప్రభుత్వం ప్రయత్నాలు చేసిందని కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



## కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య మాటల తూటాలు..

**హనుమకొండ, ఏప్రిల్ 19 :**

లోక్ సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుని వారికి ద్రోహం చేశారంటూ ఎన్డీయే నేతలు ఘాటుగా విమర్శిస్తున్నారు. డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంట్ సీట్ల పంపిణీలో అన్యాయం చేయాలని చూశారని ఇండి కూటమి నేతలు మండిపడుతున్నారు. మహిళా బిల్లును డీలిమిటేషన్‌కు ముడిపెట్టడంపైనా ఆగ్రహిస్తున్నారు. దీనిపై తెలంగాణలో నిరసనలు, ఆందోళనలతో ఈ వ్యవహారం రసవత్తరంగా మారింది.

మహిళా రిజర్వేషన్లపై తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎంపీ కడియం కావ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాగరాజు, రాజేందర్ రెడ్డి తాజాగా స్పందించారు. ఈ అంశంపై బీజేపీ తీరును ఎండగడుతూ విమర్శలు గుప్పించారు. రాజ్యాంగానికి కమలం పార్టీ తూట్లు పొడుస్తోందని ఎంపీ కడియం కావ్య మండిపడ్డారు. ఆ పార్టీ నాయకులు ఆడవారిపై ప్రేమ ఉన్నట్లు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆగ్రహించారు. మహిళల పక్షపాతి కాంగ్రెస్ మాత్రమేనని, బీజేపీకి ఓటు అడిగే కనీస హక్కు లేదన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును ముందు పెట్టి కాంగ్రెస్ పార్టీని బద్నాం చేసే కుట్ర చేశారని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణ ధ్వజమెత్తారు. ఆడవారిపై అఘాయిత్యాలను అరికట్టడంలో ఆ పార్టీ పూర్తిగా విఫలమైందని అన్నారు. దేశ సమగ్రత దెబ్బ తీయటం కోసం బీజేపీ ప్రయత్నిస్తోందని మేయర్ గుండు సుధారాణి ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌కు కాంగ్రెస్ వ్యతిరేకమంటూ దుష్ప్రచారం చేయటం సరికాదని హెచ్చరించారు. థర్డ్ క్లాస్ పార్టీ టికెట్లు, దొంగల ముఠాకు కేరాఫ్ బీజేపీ అంటూ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులెన్నో చెప్పాలని బీజేపీ నేతలను డిమాండ్ చేశారు. ఓట్ల కోసం ప్రధాని మోదీ దొంగ నాటకాలు ఆడుతున్నారంటూ ఆయన విమర్శలు గుప్పించారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో దక్షిణాది రాష్ట్రాలపై కుట్ర చేశారని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. వారి కుట్రలను ఇండి కూటమి తిప్పికొట్టిందని సంతోషం వ్యక్తం చేశారు. దక్షిణాదికి, చిన్న రాష్ట్రాలకు అన్యాయం చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. కాగా, ఈనెల 17న 131వ రాజ్యాంగ సవరణ బిల్లును లోక్ సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2/3 వంతు మెజారిటీ లేకపోవడంతో అది వీగిపోయింది. దీంతో డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల బిల్లులను కేంద్రం వెనక్కి తీసుకుంది.





# ప్రకాశ్ రాజ్ పై బీజేపీ ఫైర్

**అమరావతి, ఏప్రిల్ 19:** హిందూ దేవుళ్లపై నటుడు ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి తప్పుబట్టారు. ప్రకాశ్ రాజ్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కోట్లాది మంది ఆరాధించే హిందూ దేవుళ్ల గురించి అవమానకరంగా మాట్లాడి.. తన మాటలను మీడియా వక్రీకరించిందని చెప్పడం ఆయనకు అలవాటుగా మారిపోయిందన్నారు. హిందూ మతం, సంస్కృతి, దేవాలయాలపై ప్రకాశ్ బాధ్యతారాహిత్యంగా వ్యాఖ్యలు చేయడం మొదటి సారి కాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శ హక్కు ఉన్నప్పటికీ, అది ఎవరి విశ్వాసాలను అవమానించేలా ఉండకూడదని చెప్పారు. ప్రకాశ్ రాజ్ హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం కేరళలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రకాశ్ రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుడూ.. 'రామలక్ష్మణులు ఉత్తరభారతదేశం నుంచి వచ్చిన వలస కూలీలు. ఉత్తర భారతదేశానికి చెందిన రామలక్ష్మణులు.. దక్షిణాదికి చెందిన రావణుడి పొలంలో పళ్లను దొంగతనం చేశారు. ఇది చూసిన శూర్పణఖ జీఎస్టీతో సహా డబ్బులు కట్టమని అడిగింది. ఈ కారణంతోనే యుద్ధం మొదలైంది' అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి ప్రకాశ్ రాజ్‌పై 100 కోట్ల రూపాయలకు పరువు నష్టం దావా వేశారు. భాను ప్రకాశ్ తరఫు న్యాయవాది.. ప్రకాశ్ రాజ్‌కు లీగల్ నోటీసులు పంపించారు. హిందువుల మనోభావాలు కించపరిచేలా ఆయన వ్యాఖ్యలు చేశారని భాను ప్రకాశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లోగా హిందువులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఏడేళ్ల తర్వాత జర్మనీలో భారత రక్షణ మంత్రి పర్యటన

## రక్షణ రంగంలో సరికొత్త భాగస్వామ్యం!

## బెర్లిన్ చేరుకున్న రాజ్‌నాథ్ సింగ్..

## జర్మనీ రక్షణ మంత్రితో కీలక భేటీ



**న్యూఢిల్లీ/బెర్లిన్:** భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం జర్మనీ రాజధాని బెర్లిన్ చేరుకున్నారు. గత ఏడేళ్ల కాలంలో ఒక భారత రక్షణ మంత్రి జర్మనీలో పర్యటించడం ఇదే తొలిసారి కావడంతో ఈ పర్యటనపై అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తి నెలకొంది. భారత్-జర్మనీల మధ్య రక్షణ సహకారాన్ని పెంపొందించడమే కాకుండా, ఇరు దేశాల రక్షణ పరిశ్రమల మధ్య బలమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పడం ఈ పర్యటన యొక్క ప్రధాన లక్ష్యం. ఈ పర్యటనలో భాగంగా 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి పెద్దపీట వేయనున్నారు. ముఖ్యంగా భారత నావికాదళానికి అవసరమైన అధునాతన సబ్‌మెరైన్ల (జలాంతర్గాముల) తయారీలో జర్మన్ కంపెనీల భాగస్వామ్యంపై కీలక చర్చలు జరిగే అవకాశం ఉంది. జర్మనీకి చెందిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత్‌కు బదిలీ చేయడం (ఀఖుఅంటవతీ శీట ఎవఎష్ట్రఅశీశ్రీశీస్త్రఎ), రక్షణ పరికరాల తయారీలో జర్మన్ పెట్టుబడులను ఆహ్వానించడం వంటి అంశాలపై రాజ్‌నాథ్ సింగ్ జర్మనీ రక్షణ మంత్రితో విస్తృతస్థాయి చర్చలు జరపనున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ప్రపంచ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ తరుణంలో రక్షణ అవసరాల కోసం కేవలం కొన్ని దేశాలపైనే ఆధారపడకుండా, సరఫరా గొలుసును వైవిధ్యభరితం చేసుకోవాలని భారత్ భావిస్తోంది. ఐరోపాలో భారత్‌కు అత్యంత కీలక భాగస్వామి అయిన జర్మనీతో సంబంధాలు బలోపేతం కావడం వల్ల ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భద్రత మరియు స్థిరత్వం మెరుగుపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రాంతీయ భద్రతతో పాటు అంతర్జాతీయ సవాళ్లపై కూడా ఇరు దేశాల నేతలు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. భారత రక్షణ రంగ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో గుర్తింపు తీసుకురావడంలో భాగంగా, జర్మనీలో భారతీయ ఉత్పత్తులకు ఉన్న అవకాశాలను రాజ్‌నాథ్ సింగ్ పరిశీలించనున్నారు. ఏడేళ్ల విరామం తర్వాత జరుగుతున్న ఈ పర్యటన, ఇరు దేశాల మధ్య దశాబ్దాల కాలంగా ఉన్న వ్యూహాత్మక బంధాన్ని మరింత ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని రక్షణ శాఖ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్**

రామారెడ్డి మండలం ఉప్పల్వాయి గ్రామంలో ఆదివారం రోజున ఉప సర్పంచ్ ఆలపర్వరెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు, రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు సెంటర్లో అమ్ముకోవాలని, ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర పొందాలని, వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ డైరెక్టర్ నారాయణరెడ్డి, లెంకుల నారాయణ, వసంత రెడ్డి, ఆకుల లింగం,, ఎండి ఇర్ఫాన్, శ్రీమంతుడు, రాజలింగం, దయానంద్, సాయి కృష్ణ,శంకర్, నరేష్, శ్రీను, రాజేందర్ , రాందాస్, జంగిటి నారాయణ, సొసైటీ సిబ్బంది బైరయ్య, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు



## మహిళా రిజర్వేషన్లను అడ్డుకున్న

# టీఎంసీని శిక్షించండి



- ప్రధాని మోదీ పిలుపు
- కాంగ్రెస్‌తో కుమ్మక్కై మహిళలకు అన్యాయం చేశారని విమర్శ
- బిష్ణుపూర్ ఎన్నికల ర్యాలీలో టీఎంసీ 'జంగిల్ రాజ్'పై నిప్పులు చెరిగిన ప్రధాని
- మే 4 తర్వాత టీఎంసీ గూండాలను ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరిక

**బిష్ణుపూర్/కోల్‌కతా:** లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ సవ రణ బిల్లు వీగిపోవడానికి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), కాంగ్రెస్ పార్టీలే కారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం బిష్ణుపూర్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించా రు. బెంగాల్ తల్లులు, చెల్లెళ్లకు దక్కాల్సిన 33 శాతం రిజర్వేషన్ హక్కును మమతా బెనర్జీ ప్రభుత్వం కుట్ర పూరితంగా అడ్డుకుందని, ఇందుకు ఆ పార్టీని వచ్చే ఎన్ని కల్లో కఠినంగా శిక్షించాలని ఆయన ప్రజలకు పిలుపు నిచ్చారు. భారత రాజకీయాల్లో మహిళలకు పెద్దపీట వేయా లన్న కేంద్ర ప్రభుత్వ సంకల్పాన్ని టీఎంసీ అడ్డుకుంటోందని ప్రధాని ఆరోపించారు. "2029 నుంచే మహిళా రిజర్వే షన్లు అమలు చేయాలని మేము ప్రయత్నిస్తుంటే, తమ 'మహా జంగిల్ రాజ్'కు ఎక్కడ ముప్పు వస్తుందోనని టీఎంసీ భయపడుతోంది. ఎక్కువ మంది మహిళలు ఎమ్మెల్యేలు, ఎంపీలు కావడం మమతా దీదీకి ఇష్టం లేదు. అందుకే కాంగ్రెస్‌తో చేతులు కలిపి ఈ బిల్లును ఓడించారు" అని మోదీ విమర్శించారు. వికసిత్ భారత్ సాధనలో మహిళల భాగస్వామ్యం కీలకమని, కానీ టీఎంసీ వారిని కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తోందని మం డిపడ్డారు. బెంగాల్‌లో బీజేపీ విజయం ఖాయమని సర్వేలు చెబుతున్నాయని, ఓటమి భయంతోనే టీఎంసీ గూండాలను ప్రయోగించి ప్రజలను బెదిరిస్తోందని ప్రధాని ధ్వజమెత్తారు. "టీఎంసీ గూండాలు వెంటనే లొంగిపోవాలి. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదు" అని ఆయన హెచ్చరించారు. గతంలో గిరి జన అభ్యర్థి ద్రౌపది ముర్మును రాష్ట్రపతి ఎన్నికల్లో వ్యతిరే కించిన టీఎంసీ, కాంగ్రెస్‌లు గిరిజన వ్యతిరేక పార్టీలని ఆయన విమర్శించారు. బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేద మహిళలకు ఉచిత రేషన్ అందిస్తామని, ప్రజల సొమ్మును దోచుకునే వారిని జైలుకు పంపుతామని ప్రధాని భరోసా ఇచ్చారు. ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతలుగా జరగనున్న పోలింగ్‌లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని బీజేపీని గెలిపించాలని కోరారు. మహిళా భద్రత, సాధికారతకు బీజేపీ మాత్రమే కట్టుబడి ఉ ంటుందని ఆయన పునరుద్ఘాటించారు.

# విరుదునగర్‌లో పెను విషాదం

- బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు..
- 18 మంది సజీవ దహనం!
- సెకన్ల వ్యవధిలోనే కుప్పకూలిన నాలుగు భవనాలు
- శిథిలాల కింద మరికొందరు కార్మికులు..
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- ముత్తు మునియాండికి చెందిన 'వనజ' ఫ్యాక్టరీలో అమానుషం..



**విరుదునగర్, ఏప్రిల్19:** తమిళనాడులోని విరుదునగర్ జిల్లాలో ఆదివారం ఉదయం పెను ప్రమాదం చోటుచేసుకుంది. సాత్తూరు సమీపంలోని కట్టనార్‌పట్టిలో ఉన్న 'వనజ' అనే ప్రైవేటు బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన భారీ పేలుడులో సుమారు 18 మంది కార్మికులు అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. పేలుడు ధాటికి ఫ్యాక్టరీలోని నాలుగు భవనాలు సెకన్ల వ్యవధిలోనే పూర్తిగా నేలమట్టమయ్యాయి. మంటలు భారీగా ఎగసిపడుతుండటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది. ఈ దారుణ ఘటనతో స్థానిక గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. విరుదునగర్ జిల్లాలో బాణసంచా తయారీనే జీవనాధారంగా చేసుకున్న వేలాది మంది కార్మికులు పనిచేస్తుంటారు. ముత్తు మునియాండి అనే వ్యక్తికి చెందిన ఈ 'వనజ' ఫ్యాక్టరీలో చుట్టుపక్కల ప్రాంతాల నుండి వచ్చిన స్త్రీ, పురుష కార్మికులు ఆదివారం ఉ దయం యథావిధిగా విధులకు హాజరయ్యారు. కర్మాగారంలోని భవనాల్లో బాణసంచా తయారీలో నిమగ్నమై ఉండగా, ఒక భాగంలో అకస్మాత్తుగా పేలుడు సంభవించింది. ఈ క్రమంలో మంటలు ఇతర భవనాలకు వేగంగా వ్యాపించడంతో వరసగా పేలుళ్లు జరిగి భవనాలు కూలిపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది మరియు పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. రెస్క్యూ టీమ్స్ శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రమాదంలో 18 మంది మరణించినట్లు అధికారులు ధృవీకరించగా, సుమారు 9 మందికి పైగా తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. క్షతగాత్రులను వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. మరణించిన వారి మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఫ్యాక్టరీలో భద్రతా నిబంధనలను అతిక్రమించారా లేదా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఫ్యాక్టరీ యజమాని ముత్తు మునియాండిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఘటనా స్థలంలో ఇంకా మంటలు పూర్తిగా అదుపులోకి రాలేదు, శిథిలాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. బాణసంచా పరిశ్రమలో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతుండటంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మా హక్కులను కాదనడానికి

# ట్రంప్ ఎవరు?

## ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఆగ్రహం

## యూరేనియం శుద్ధి మా హక్కు.. ఆంక్షలను అంగీకరించబోం

## యుద్ధం ముగించాలని ఉంది కానీ గౌరవాన్ని వదులుకోం

## గల్ఫ్ ప్రాంతంలో శాంతిని కోరుకుంటున్నామని స్పష్టీకరణ



**టెహ్రాన్:** ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా విధిస్తున్న ఆంక్షలు మరియు ఒత్తిడిపై ఆ దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఘాటుగా స్పందించారు. తమ దేశ గౌరవానికి భంగం కలగకుండానే యుద్ధాన్ని ముగించాలని తాము భావిస్తున్నామని, అయితే తమ ప్రాథమిక హక్కులను హరించే అధికారం ఏ దేశానికీ లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా యూరేనియం శుద్ధి చేయడం ఇరాన్ యొక్క అణు హక్కు అని, దానిని అడ్డుకోవాలని చూడటం వివక్షతో కూడిన చర్య అని ఆయన మండిపడ్డారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని కనీసం 20 ఏళ్ల పాటు పునరుద్ధరించకూడదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పట్టుబడుతున్న నేపథ్యంలో పెజెష్కియాన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. "మా అణు హక్కులపై ట్రంప్ ఆంక్షలు విధించే ప్రయత్నం చేస్తున్నారు. అసలు మా హక్కులను కాదనడానికి ఆయన ఎవరు?" అని ఆయన ప్రశ్నించారు. ఏ కారణం చేత ఇలాంటి ఆంక్షలు విధిస్తున్నారో అమెరికా చెప్పలేకపోతోందని, అందరి విషయంలో అంతర్జాతీయ సమాజం ఒకేలా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. గల్ఫ్ ప్రాంతంలో శాంతి మరియు సుస్థిరత నెలకొల్పడమే ఇరాన్ విధానమని పెజెష్కియాన్ పునరుద్ఘాటించారు. యుద్ధాన్ని మరింత విస్తృతం చేసే ఉద్దేశం తమకు లేదని, ఇప్పటివరకూ తాము ఎలాంటి ఘర్షణలకు కారణం కాలేదని ఆయన పేర్కొన్నారు. ఇతర దేశాలపై దాడులు చేయడం తమ లక్ష్యం కాదని, అయితే తమపై దాడులు జరిగినప్పుడు స్వీయ రక్షణ చర్యలు తీసుకోవడం తమ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. అంతర్జాతీయ వేదికలపై అన్ని దేశాలను సమానంగా చూడాలని, ఇరాన్ పట్ల వివక్ష చూపిస్తూ అణు కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరికాదని పెజెష్కియాన్ అన్నారు. తమ దేశాభివృద్ధికి అణు శక్తి కీలకమని, దానిపై రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. ఇరాన్ అధ్యక్షుడి వ్యాఖ్యలతో అగ్రరాజ్యం అమెరికా మరియు ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు మరింత ముదిరే అవకాశం ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



# భారత నౌకలపై ఇరాన్ కాల్పులు

## సంచలనంగా మారిన ఆడియో!

## దాడి నేపథ్యంలో వెనక్కి మళ్లిన చమురు ట్యాంకర్లు

## ఇరాన్ రాయబారితో విదేశీ వ్యవహారాల శాఖ చర్చలు..

**న్యూఢిల్లీ/టెహ్రాన్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరుకున్న వేళ, హోర్ముజ్ జలసంధిలో భారత వాణిజ్య నౌకలపై ఇరాన్ విప్లవాత్మక గార్డ్స్ (ఐఆర్‌జీసీ) గన్‌బోట్లు కాల్పులు జరపడం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. నౌకలపై భారత జెండాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ ఇరాన్ సైన్యం ఈ దాడికి పాల్పడటం గమనార్హం. దాదాపు రెండు మిలియన్ బ్యారెళ్ల ముడి చమురుతో భారత్‌కు వస్తున్న 'సన్మర్ హెరాల్డ్', 'జగ్ అర్నవ్' అనే రెండు ట్యాంకర్లు ఈ కాల్పుల ధాటికి వెనక్కి మళ్లినట్లు ట్యాంకర్ ట్రాకర్ సంస్థ వెల్లడించింది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ప్రాణనష్టం సంభవించలేదు. ఈ దాడికి సంబంధించి ట్యాంకర్ ట్రాకర్ విడుదల చేసిన 30 సెకన్ల ఆడియో క్లిప్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కాల్పులు జరుగుతున్న సమయంలో 'సన్మర్ హెరాల్డ్' నౌకకు చెందిన అధికారి ఇరాన్ నావికాదళంతో మాట్లాడిన సంభాషణలు ఇందులో ఉన్నాయి. "సెఫా నేవీ.. మేము వెళ్లడానికి మీరు ముందుగా అనుమతి ఇచ్చారు, కానీ ఇప్పుడేమో కాల్పులు జరుపుతున్నారు. మమ్మల్ని వెనక్కు వెళ్లనివ్వండి" అంటూ సదరు అధికారి ఆవేదన వ్యక్తం చేయడం ఆ ఆడియోలో వినిపిస్తోంది. ఇరాన్ తీరుతో భారత నావికులు ప్రాణభయంతో వణికిపోయినట్లు ఈ సంభాషణ ద్వారా స్పష్టమవుతోంది. భారత నౌకలపై జరిగిన ఈ దాడిపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శనివారం ఇరాన్ రాయబారిని పిలిపించి చర్చలు జరిపింది. వాణిజ్య నౌకలు, నావికుల భద్రత విషయంలో భారత్ రాజీ పడబోదని విదేశీ వ్యవహారాల కార్యదర్శి స్పష్టం చేశారు. గతంలో ఇరాన్ భారత నౌకలకు సహకరించిన అంశాన్ని గుర్తుచేస్తూనే, ప్రస్తుత పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేశారు. జలసంధి గుండా భారత నౌకల రాకపోకలు సురక్షితంగా సాగేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఇరాన్ అధికారులకు భారత ప్రభుత్వం గట్టిగా సూచించింది.





# సొంతింటి కల... సామాన్యుడి లక్ష్యం

## అందరికీ అందుబాటు ధరల్లో ప్లాట్ల విక్రయం

## కాచవాని సింగారం లో మలిపెద్ది హనుమంత రెడ్డి ఎంక్లేవ్ బ్రోచర్ ఆవిష్కరణ



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:**

అందరికీ అందుబాటు ధరల్లో గృహ స్థలాలను అందించాలనే లక్ష్యంతో కాచవాని సింగారం ప్రాంతంలో రూపుదిద్దుకున్న మలిపెద్ది హనుమంత రెడ్డి ఎంక్లేవ్ వెంచర్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, మలిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ మేయర్ అమర్ సింగ్ వెంచర్ యజమానులు బండి సతీష్ గౌడ్ మాడుగుల చంద్రారెడ్డి లతో కలిసి బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేగంగా అభివృద్ధి చెందుతున్న కాచవాని సింగారం ప్రాంతంలో ఈ వెంచర్ ప్రజలకు మంచి అవకాశంగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ రెరా, హెచ్‌ఎండిఏ అనుమతులతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న మల్లిపెద్ది హనుమంత రెడ్డి ఎంక్లేవ్ సాధారణ మధ్యతరగతి ప్రజలకు సైతం అందుబాటు ధరలకే ప్లాట్లు విక్రయిస్తున్నారని తెలిపారు. నగర విస్తరణ నేపథ్యంలో భవిష్యత్ పెట్టుబడులకు అనుకూలమైన ప్రదేశంగా ఈ ఎంక్లేవ్ రూపుదిద్దుకుందని వివరించారు.

### అనుభవజ్ఞుల భాగస్వామ్యంతో వెంచర్ రూపకల్పన

రియల్ ఎస్టేట్ రంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన మాజీ వార్డు సభ్యులు బండి సతీష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాడుగుల చంద్రారెడ్డి భాగస్వామ్యంతో ఈ వెంచర్ రూపుదిద్దుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసిన ఈ ఎంక్లేవ్‌లో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ప్లాట్ల సరైన లేఅవుట్, భూగర్భ విద్యుత్, సువిశాలమైన రోడ్లు శుభ్రమైన వాతావరణం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ వెంచర్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ వెంచర్ కొనుగోలుదారులకు విశ్వసనీయమైన పెట్టుబడి అవకాశంగా ఇది నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

### అక్షయ తృతీయ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు

అక్షయ తృతీయను పురస్కరించుకుని వెంచర్ యజమానులు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించారు. పరిమిత కాలానికి వర్తించే ఈ ఆఫర్ల ద్వారా తక్కువ ధరల్లో ప్లాట్లు పొందే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గృహ స్థలం కొనుగోలు చేయాలని భావిస్తున్న వారికి ఇది మంచి అవకాశం అవుతుందని నిర్వాహకులు తెలిపారు.

### పెట్టుబడిదారులకు ఆకర్షణీయ అవకాశం

కాచవాని సింగారం ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఈ వెంచర్ పెట్టుబడిదారులను ఆకర్షించే అవకాశముందని పలువురు అభిప్రాయపడ్డారు. భవిష్యత్‌లో విలువ పెరిగే అవకాశాలు ఉన్న ప్రదేశంగా ఇది నిలుస్తుందని తెలిపారు.

### పలువురు ప్రముఖుల హాజరు

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన వ్యక్తులు, ఆసక్తి గల కొనుగోలుదారులు పాల్గొని వెంచర్ వివరాలను తెలుసుకున్నారు. నిర్వాహకులు ప్రాజెక్టు విశేషాలను వివరించి సందేహాలను నివృత్తి చేశారు.





# వంట గ్యాస్ కొరత ముంచుకొస్తుందా?

### హోర్ముజ్ సెగ.. భారత్‌లో ఇంధన భద్రతపై ఆందోళన..

### 60 రోజుల చమురు, 40 రోజుల ఎల్‌పీజీ నిల్వలు సిద్ధం: కేంద్రం వెల్లడి

### జలసంధి మూసివేతతో రవాణా భారమయ్యే ప్రమాదం..

## ప్రత్యామ్నాయాలపై ప్రభుత్వం కసరత్తు





న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో నెలకొన్న తాజా ఉద్రిక్తతలు భారత ఇంధన మార్కెట్‌ను కలవరపెడుతున్నాయి. అమెరికా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్న నెపంతో ఇరాన్ 'హోర్ముజ్ జలసంధి'ని మూసివేస్తున్నట్లు ప్రకటించడం, ఆ మార్గంలో ప్రయాణించే వాణిజ్య నౌకలపై కాల్పులు జరపడం అంతర్జాతీయంగా పెను సంచలనం రేకెత్తిస్తోంది. భారత్ తన చమురు అవసరాల్లో సుమారు 85 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్న తరుణంలో, ఈ పరిణామాలు దేశీయంగా పెట్రోల్, డీజిల్ మరియు వంట గ్యాస్ సరఫరాపై ఎలాంటి ప్రభావం చూపుతా యనే అంశంపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. ప్రస్తుతానికి దేశంలో ఇంధన కొరత తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. రక్షణ మరియు ఇంధన మంత్రిత్వ శాఖల సమాచారం ప్రకారం, దేశంలో ప్రస్తుతం 60 రోజులకు సరిపడా ముడి చమురు నిల్వలు అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా 50 రోజుల ఎల్ఎన్‌జీ నిల్వలు, 40 రోజుల ఎల్‌పీజీ (వంట గ్యాస్) నిల్వలు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం భరోసా ఇస్తోంది. మార్చి నెల నాటి గణాంకాలను పరిశీలిస్తే, దేశం మొత్తం మీద సుమారు 74 రోజుల వరకు వ్యూహాత్మక నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. దీనివల్ల తక్షణమే ఇంధన సంక్షోభం తలెత్తే అవకాశం లేదని అధికారిక వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, హోర్ముజ్ జలసంధి దీర్ఘకాలం పాటు మూతపడితే మాత్రం భారత ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. సౌదీ అరేబియా, యూఏఈ వంటి పశ్చిమ ఆసియా దేశాల నుంచి భారత్‌కు వచ్చే చమురు ట్యాంకర్లు ప్రధానంగా ఈ జలసంధి గుండానే రావాలి. ఈ మార్గం మూసుకుపోతే రవాణా ఖర్చులతో పాటు బీమా ప్రీమియంలు విపరీతంగా పెరిగిపోతాయి. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ చమురు ధర ఒక్కసారిగా పెరిగి, ఆ భారం దేశీయ వినియోగదా రులపై పడే ప్రమాదం ఉంది. ఇంధన ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం ప్రభుత్వానికి పెను సవాలుగా మారుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి భారత్ ఇప్పటికే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. కేవలం ఒకే ప్రాంతంపై ఆధారపడకుండా రష్యా, అమెరికా, ఆఫ్రికా మరియు లాటిన్ అమెరికా దేశాల నుంచి చమురు దిగుమతులను పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. రెడ్ సీ--సూయజ్ కాలువ మార్గం వంటి ఇతర మార్గాలను కూడా వినియోగించుకుం టోంది. అయినప్పటికీ, ప్రధాన సరఫరాదారులు పశ్చిమాసియాలోనే ఉన్నందున హోర్ముజ్ సంక్షోభంపై కేంద్ర ప్రభుత్వం నిశితంగా దృష్టి సారించింది. యుద్ధ వాతావరణం సద్దుమణిగితేనే ఇంధన ధరలు స్థిరంగా ఉంటాయని విశ్లేషకులు అభిప్రాయపడు



## ఒప్పందానికి రాకుంటే..

### ఇరాన్‌ను నామరూపాల్లేకుండా చేస్తాం : ట్రంప్ హెచ్చరిక

### విద్యుత్ కేంద్రాలు, వంతెనలనే లక్ష్యంగా చేస్తామని వార్నింగ్

### హోర్ముజ్‌లో కాల్పులపై ఆగ్రహం.. పాకిస్థాన్ వేదికగా చర్చలకు సిద్ధం

### ఒప్పందానికి అంగీకరించకపోతే 'హత్యాకాండ'

**వాషింగ్టన్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరుకున్న వేళ, ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ ప్రకటనకు సమానమైన హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ తన తీరు మార్చుకోకపోతే ఆ దేశంలోని ప్రతి విద్యుత్ కేంద్రం, ప్రతి వంతెనను అమెరికా ధ్వంసం చేస్తుందని ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'ట్రూత్ సోషల్' వేదికగా హెచ్చరించారు. గత 47 ఏళ్లుగా ఇతర అమెరికా అధ్యక్షులు చేయలేని పనిని తాను చేసి చూపిస్తానని, ఇరాన్ చేస్తున్న 'హత్యాకాండ'కు ముగింపు పలికే సమయం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఇటీవల జరిపిన కాల్పులపై ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఇది ముమ్మాటికీ కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనేనని ఆయన అభివర్ణించారు. "ఇరాన్ నిన్న హోర్ముజ్ జలసంధిలో కాల్పులు జరపాలని నిర్ణయించుకోవడం మంచి పరిణామం కాదు. ఫ్రాన్స్ నౌకతో పాటు యునైటెడ్ కింగ్‌డమ్ సరుకు నౌకలను వారు లక్ష్యంగా చేసుకున్నారు. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు" అని ట్రంప్ మండిపడ్డారు. జలసంధిని మూసివేస్తామన్న ఇరాన్ ప్రకటనపై సెటైర్లు వేస్తూ, ఇప్పటికే అమెరికా విధించిన నిర్బంధం (బ్లాకేడ్) వల్ల ఆ మార్గం మూతపడిందని, దీనివల్ల ఇరాన్ రోజుకు 500 మిలియన్ డాలర్లు నష్టపోతుందని ఆయన ఎద్దేవా చేశారు. ఒకవైపు హెచ్చరికలు జారీ చేస్తూనే, మరోవైపు దౌత్యపరమైన చర్చలకు ట్రంప్ తలుపులు తెరిచారు. ఇరాన్ ప్రతినిధులతో చర్చలు జరిపేందుకు తన దూతలు పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌కు వెళ్తున్నట్లు ఆయన వెల్లడించారు. సోమవారం సాయంత్రం కల్లా తన ప్రతినిధి బృందం అక్కడ ఉంటుందని, చాలా న్యాయమైన ఒప్పందాన్ని ఇరాన్ ముందు ఉంచుతామని ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందాన్ని అంగీకరిస్తేనే ఇరాన్ మనుగడ సాధ్యమని ఆయన పరోక్షంగా సూచించారు.

### అమెరికాకు నష్టం లేదు

ఇరాన్ చర్యల వల్ల అమెరికాకు ఎటువంటి నష్టం లేదని, చాలా నౌకలు ఇప్పటికే టెక్సాస్, లూసియానా, అలాస్కా వంటి సురక్షిత ప్రాంతాలకు మళ్లాయని ట్రంప్ స్పష్టం చేశారు. "మేము ప్రతిపాదిస్తున్న ఒప్పందాన్ని ఇరాన్ అంగీకరిస్తుందని ఆశిస్తున్నాను. లేనిపక్షంలో వారు చాలా సులభంగా దిగివచ్చేలా చేయాల్సిన పనిని (దాడిని) నేను చేస్తాను. ఇది నాకు గౌరవప్రదమైన విషయం" అని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఏప్రిల్ 20న పాకిస్థాన్‌లో జరగబోయే చర్చలు ఈ ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతాయా లేదా అన్నది ఉత్కంఠగా మారింది.


# అప్పుడలా... ఇప్పుడిలా

## నవ్యాంధ్రకు నిధుల వరద!

### కేంద్రం కేటాయింపులతో అమరావతికి మహర్దశ

### రాజకీయ సమీకరణాల ఫలితమే అభివృద్ధికి కీలకం

### ప్రత్యేక ప్యాకేజీని మించిన సాయం



**హైదరాబాద్, ఏప్రిల్ 19(రాజముద్ర న్యూస్):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం నుంచి ఊహించని రీతిలో భారీగా నిధులు తరలివస్తున్నాయి. గత పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న అనేక అంశాలకు ఒక్కసారిగా మోక్షం లభిస్తోంది. ముఖ్యంగా నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం పచ్చజెండా ఊపడమే కాకుండా, పూర్తిస్థాయిలో ఆర్థిక సహకారం అందించడం రాష్ట్ర అభివృద్ధిలో ఒక కీలక మలుపుగా మారుతోంది. రాజకీయంగా చోటుచేసుకున్న సమీకరణాలు ఏవైనప్పటికీ, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు ఈ నిధుల కేటాయింపులు ఒక రకమైన 'ప్రత్యేక ప్యాకేజీ'ని మించిన ప్రయోజనాన్ని చేకూరుస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నిజానికి 2014లో రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన తొలి ప్రభుత్వంలోనూ బీజేపీ భాగస్వామిగా ఉంది. అప్పట్లో హైదరాబాద్ పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో అమరావతిని రాజధానిగా ఎంపిక చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా వచ్చి శంకుస్థాపన చేసినప్పటికీ, ఆ తర్వాత పరిస్థితులు ఆశాజనకంగా సాగలేదు. ఆనాడు ప్రధాని తెచ్చిన మట్టి, నీరు తప్ప రాష్ట్రానికి పెద్దగా ఒరిగిందేమీ లేదన్న విమర్శలు వచ్చాయి. మిత్రపక్షంగా ఉన్నప్పటికీ నిధుల విషయంలో కేంద్రం మొండిచేయి చూపడం, చంద్రబాబు పట్ల అప్పట్లో ఉన్న రాజకీయ అపనమ్మకాలు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని కొంత కాలం పాటు స్తంభింపజేశాయి.

### జగన్ హయాంలో అయోమయం

2019లో అధికార మార్పిడి తర్వాత పరిస్థితి మరింత జటిలమైంది. మూడు రాజధానుల నినాదంతో జగన్ ప్రభుత్వం ముందుకు సాగడం, రాజధాని విషయంలో స్పష్టత లేకపోవడంతో కేంద్రం కూడా ఆంధ్రప్రదేశ్‌ను పట్టించుకోవడం మానేసింది. రాష్ట్రానికే స్పష్టత లేనప్పుడు తాము జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదన్నట్లుగా మోదీ సర్కార్ మిన్నకుండిపోయింది. ప్రత్యేక హోదా లేదా ప్యాకేజీ డిమాండ్లు కేవలం రాజకీయ నినాదాలకే పరిమితమయ్యాయి తప్ప, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సాధించిన పాపాన ఎవరూ పోలేదు. అటు బాబు, ఇటు జగన్ ఇద్దరూ మోదీ ముందు విజ్ఞప్తులు చేయడం తప్ప గట్టిగా నిలదీయలేకపోయారనే విమర్శలు కూడా బలంగా వినిపించాయి.



### మారుతున్న సమీకరణాలు - నూతన శకం

అయితే ఇప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో సీన్ మొత్తం మారిపోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కేవలం మిత్రపక్షంగా మాత్రమే కాకుండా, కేంద్రంలోని ఎన్డీయేలో అత్యంత కీలక భాగస్వామిగా ఉంది. గతంలో కంటే ఇప్పుడు బీజేపీకి రాష్ట్రంలో పట్టు పెరగడం, తాము కూడా ప్రభుత్వంలో భాగం కావడంతో క్రెడిట్ మొత్తం తమకే దక్కాలనే ఆలోచనలో కేంద్రం ఉంది. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ రూపంలో ఎన్డీయేకు దక్కిన బలం, ఇప్పుడు రాష్ట్రానికి నిధుల రూపంలో కలిసొస్తోంది. తమ సహకారం వల్లే అభివృద్ధి జరుగుతోందనే ముద్ర వేయడానికి బీజేపీ గట్టిగా ప్రయత్నిస్తోంది.

### రైతుల్లో సంతోషం.. బాబులో ఊపు

కేంద్రం నుంచి వస్తున్న ఈ నిధుల ప్రవాహంతో అమరావతి రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లుగా నిలిచిపోయిన పనులు మళ్లీ పట్టాలెక్కుతున్నాయి. రాజధాని ఖరారు కావడంతో పాటు నిర్మాణ పనులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం చంద్రబాబు ప్రభుత్వానికి నైతిక బలాన్ని ఇచ్చింది. పవన్ కళ్యాణ్ మధ్యవర్తిత్వం మరియు చంద్రబాబు రాజకీయ చతురత వెరసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక 'నవశకం' ప్రారంభమైందని చెప్పవచ్చు. రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా సాగుతున్న ఈ ప్రయాణం భవిష్యత్తులో నవ్యాంధ్రను ఏ స్థాయికి తీసుకెళ్తుందో వేచి చూడాలి.

# పంజాబ్ కింగ్స్ ప్రచండ విజయం!

## లక్నో సూపర్ జెయింట్స్ పై 54 పరుగుల గెలుపు

- పీసీఏ స్టేడియంలో పరుగుల వరద
- ప్రియాన్ష్, కొన్నోలీ విధ్వంసక ఇన్నింగ్స్
- 20 ఓవర్లలో 254 పరుగుల భారీ స్కోరు
- ఛేదనలో 200 పరుగులకే పరిమితమైన ఎల్ఎస్జీ



**మొహాలీ, ఏప్రిల్ 19 :** ఐపీఎల్ 2026 సీజన్ లో భాగంగా ఆదివారం పీసీఏ న్యూ క్రికెట్ స్టేడియంలో జరిగిన 29వ లీగ్ మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ జట్టు అద్భుత విజయం సాధించింది. లక్నో సూపర్ జెయింట్స్ పై 54 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్న లక్నో జట్టు నిర్ణయం బెడిసికొట్టింది. పంజాబ్ బ్యాటర్లు చెలరేగి ఆడటంతో నిర్ణీత 20 ఓవర్లలో భారీ స్కోరు నమోదైంది. పంజాబ్ విసిరిన 255 పరుగుల లక్ష్య ఛేదనలో లక్నో బ్యాటర్లు తడబడ్డారు.

### సత్తా చాటిన పంజాబ్

తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 254 పరుగుల పర్వతాన్ని నిర్మించింది. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య కేవలం 37 బంతుల్లోనే 93 పరుగులు చేసి తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. మరో ఎండ్ లో కూపర్ కొన్నోలీ 46 బంతుల్లో 87 పరుగులతో లక్నో బౌలర్లపై విరుచుకుపడ్డాడు. చివర్లో మార్కస్ స్టోయినిస్ 16 బంతుల్లో 29 పరుగులతో రాణించడంతో జట్టు స్కోరు 250 దాటింది. లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ 25 పరుగులిచ్చి 2 వికెట్లు తీయగా, ఎం సిద్ధార్థ్ 35 పరుగులకు 2 వికెట్లు పడగొట్టాడు. మోసిన్ ఖాన్ కు ఒక వికెట్ దక్కింది.





### లక్ష్య ఛేదనలో తడబాటు

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత ఓవర్లు ముగిసే సరికి 5 వికెట్లు కోల్పోయి 200 పరుగులు మాత్రమే చేయగలిగింది. రిషబ్ పంత్ 23 బంతుల్లో 43 పరుగులు, ఐడెన్ మార్క్రమ్ 22 బంతుల్లో 42 పరుగులు, మిచెల్ మార్ష్ 28 బంతుల్లో 40 పరుగులతో పోరాడినా అవసరమైన రన్ రేట్ ను అందుకోలేకపోయారు. భారీ లక్ష్యం కావడంతో బ్యాటర్లపై ఒత్తిడి పెరిగి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయారు. పంజాబ్ బౌలర్లలో మార్కో జాన్సెన్ 37 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. విజయ్ కుమార్ వైశాక్, యుజ్వేంద్ర చాహల్ పొదుపుగా బౌలింగ్ చేసి తలా ఒక వికెట్ దక్కించుకుని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.



---

# రింకూ మెరుపులు.. వరుణ్ స్పిన్!

## రాజస్థాన్ రాయల్స్‌కు తప్పని పరాజయం

- ఆఖరి వరకు నరాలు తెగే ఉత్కంఠ
- ఆరు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరిన కోల్‌కతా
- మొదట బ్యాటింగ్ చేసి తడబడ్డ ఆర్ఆర్ బ్యాటర్లు
- కేకేఆర్ ఖాతాలో మరో అద్భుత విజయం





**కోల్‌కతా, ఏప్రిల్ 19:** కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఆదివారం రాత్రి కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్ అభిమానులను ఉర్రూతలూగించింది. ఆఖరి ఓవర్ వరకు నరాలు తెగే ఉత్కంఠ మధ్య సాగిన ఈ పోరులో కేకేఆర్ నాలుగు వికెట్ల తేడాతో రాజస్థాన్‌ను చిత్తు చేసింది. సొంతగడ్డపై అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. బౌలింగ్‌లో వరుణ్ చక్రవర్తి, బ్యాటింగ్‌లో రింకూ సింగ్ రాణించి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు.

### రాజస్థాన్ తడబాటు

టాస్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్ మొదట బ్యాటింగ్‌కు మొగ్గు చూపింది. కేకేఆర్ బౌలర్ల కట్టుదిట్టమైన బంతుల ధాటికి బ్యాటర్లు పరుగులు రాబట్టేందుకు తీవ్రంగా శ్రమించారు. నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 155 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ (28 బంతుల్లో 46), యశస్వి జైస్వాల్ (29 బంతుల్లో 39) రాణించి మంచి శుభారంభాన్ని ఇచ్చినా ఆ తర్వాత వచ్చిన వారు విఫలమయ్యారు. షిమ్రాన్ హెట్మెయర్ 15 పరుగులకే వెనుతిరిగాడు. కేకేఆర్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి తన స్పిన్ మాయాజాలంతో రాజస్థాన్ పతనాన్ని శాసించాడు. కేవలం 14 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. కార్తీక్ త్యాగి కూడా 22 పరుగులిచ్చి మూడు వికెట్లు తీశాడు. సునీల్ నరైన్‌కు రెండు వికెట్లు దక్కాయి.

### రింకూ సింగ్ మెరుపులు

అనంతరం 156 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతా జట్టుకు రాజస్థాన్ బౌలర్లు ఆదిలోనే చుక్కలు చూపించారు. ఈ క్లిష్ట పరిస్థితిలో క్రీజులోకి వచ్చిన రింకూ సింగ్ 34 బంతుల్లో 53 పరుగులతో నాటౌట్‌గా నిలిచి అద్భుతమైన హాఫ్ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. చివర్లో అనుకుల్ రాయ్ 16 బంతుల్లో 29 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, కామెరాన్ గ్రీన్ 13 బంతుల్లో 27 వేగంగా పరుగులు సాధించాడు. దీంతో కేకేఆర్ 19.4 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసి గెలుపు తీరానికి చేరింది. రెండు బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని ఖాయం చేసుకుంది. రాజస్థాన్ బౌలర్లలో రవీంద్ర జడేజా రెండు వికెట్లు పడగొట్టగా, నాంద్రే బర్గర్, యష్ పుంజాలకు తలో వికెట్ దక్కింది. అద్భుత బౌలింగ్ ప్రదర్శనతో కేకేఆర్ విజయానికి బాటలు వేసిన వరుణ్ చక్రవర్తికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.



# భయానికి కొత్త నిర్వచనం '418'..

## హారర్ జోనర్‌లో మైత్రీ మూవీ మేకర్స్ ప్రయోగం

కమర్షియల్ ఎంటర్‌టైనర్లతో టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసుకున్న మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఇప్పుడు కొత్త దారిని ఎంచుకుంది. తొలిసారి పూర్తి స్థాయి హారర్ కథాంశంతో '418' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తూ ప్రేక్షకులను భయపెట్టేందుకు సిద్ధమవుతోంది. కెజిఎఫ్‌తో గుర్తింపు పొందిన ప్రశాంత్ నీల్ సమర్పణలో, కీర్తన్ నాదగౌడ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. తాజాగా విడుదలైన టైటిల్ పోస్టర్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. ఈ చిత్రానికి ఇచ్చిన ట్యాగ్‌లైన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపు చేస్తోంది. "హారర్ సినిమాల్లో నవ్వులు చాలాయి.. ఇక భయం మొదలవ్వాలి" అనే భావంతో వచ్చిన ఈ క్యాప్షన్, ఈ సినిమా ఏ దిశలో సాగబోతోందో స్పష్టంగా చెబుతోంది. ఇటీవల హారర్ సినిమాల్లో కామెడీ మోతాదు పెరగడంతో భయం తగ్గిపోయిందనే అభిప్రాయాల మధ్య, ఈ సినిమా మాత్రం నిజమైన హారర్ అనుభూతిని అందించాలనే లక్ష్యంతో రూపొందుతున్నట్టు తెలుస్తోంది. పోస్టర్‌లో రక్తపు మరకలతో ఉన్న తలుపు, దానిపై '418' అనే సంఖ్య కనిపించడం కథపై ఆసక్తిని పెంచుతోంది. దీన్ని బట్టి కథ ఒక రహస్య గది చుట్టూ తిరిగే సైకాలజికల్ హారర్‌గా ఉండొచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ చిత్రంలో సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రశాంత్ నీల్ ఈ ప్రాజెక్ట్‌ను సమర్పించడం వల్ల సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఆయన సినిమాల్లో కనిపించే డార్క్ మూడ్ ఈ చిత్రంలో కూడా ఉంటే, ప్రేక్షకులకు థియేటర్లలో నిజమైన భయానుభూతి కలిగే అవకాశం ఉందని సినీ అభిమానులు ఆశిస్తున్నారు.




# నీలి చీరలో నిధి అగర్వాల్ మెరిసిన అందం

టాలీవుడ్‌లో గ్లామర్ హీరోయిన్‌గా ప్రత్యేక స్థానం సంపాదించిన నిధి అగర్వాల్, తన స్టైల్‌తో ఎప్పటికప్పుడు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అందం, ఆకర్షణీయమైన లుక్స్‌తో సోషల్ మీడియాలో కూడా ఆమెకు మంచి ఫాలోయింగ్ ఉంది. ఇటీవల ఆమె షేర్ చేసిన తాజా ఫోటోలు అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి. నీలి చీరలో సంప్రదాయంగా కనిపిస్తూ కూడా తన గ్లామర్‌ను చక్కగా హైలైట్ చేసింది. ఆ ఫోటోలు చూసిన అభిమానులు ఆమె అందాన్ని ప్రశంసిస్తూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. ఈ ఫోటోషూట్ ద్వారా మరోసారి అందరి దృష్టిని తనవైపు తిప్పుకున్న నిధి, సంప్రదాయం, మోడ్రన్ లుక్‌ను సమతూకంగా మేళవిస్తూ తన ప్రత్యేకతను మ- ంో నా రి



# సబ్‌స్క్రిప్షన్‌పై అనన్య నాగళ్ల క్లారిటీ..

సినిమా, టెలివిజన్ పరిమితులను దాటి ఆదాయం కోసం కొత్త మార్గాలను అన్వేషిస్తున్న నటీమణులు ఇప్పుడు సోషల్ మీడియాను ప్రధాన వేదికగా మార్చుకుంటున్నారు. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రారంభమైన 'సబ్‌స్క్రిప్షన్' ట్రెండ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ జాబితాలో తాజాగా యంగ్ హీరోయిన్ అనన్య నాగళ్ల కూడా చేరడం హాట్ టాపిక్‌గా నిలిచింది. ఇప్పటికే యాంకర్ విష్ణు ప్రియ సబ్‌స్క్రిప్షన్ వ్యవహారం చర్చల్లో ఉండగా, అనన్య కూడా అదే మార్గాన్ని ఎంచుకోవడం మరింత ఆసక్తి రేకెత్తించింది. అయితే ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణాలను ఆమె తాజాగా వెల్లడించింది. సబ్‌స్క్రిప్షన్ ప్లాట్‌ఫామ్‌లో షేర్ చేసిన మెడిటేషన్ వీడియోతో పాటు ఒక వివరణాత్మక వీడియోను విడుదల చేసిన అనన్య, తన ఉద్దేశాన్ని స్పష్టంగా చెప్పింది. అభిమానులతో నిరంతరం కనెక్ట్‌లో ఉండడం, వారితో కలిసి ఎదగడం తన లక్ష్యమని తెలిపింది. తనకు ఉపయోగపడిన అనుభవాలు, ప్రతిరోజూ పాటించే అలవాట్లు ఫాలోవర్లతో పంచుకోవాలని, అలాగే వారినుంచి కూడా కొత్త విషయాలు నేర్చుకోవాలని భావించానని వివరించింది. ఇక సమాజానికి కూడా ప్రతి నెల కొంత సహాయం చేయాలనే ఉద్దేశంతో ఈ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభించానని ఆమె చెప్పుకొచ్చింది. గత కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగాలేకపోవడంతో అభిమానులతో మాట్లాడలేకపోయానని, తాజాగా షేర్ చేసిన మెడిటేషన్ వీడియో తన రోజువారీ జీవితంలో భాగమని వెల్లడించింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అనన్య నిర్ణయానికి కొందరు నెటిజన్లు మద్దతు తెలుపుతున్నారు. ఆమె సహాయక స్వభావాన్ని గుర్తుచేస్తూ, ఈ ప్రయత్నాన్ని అభినందిస్తున్నారు.

# హోంబలే నుంచి మరో భారీ యానిమేటెడ్ ఎపిక్



## 'మహావతార్ పరశురామ్' అనౌన్స్‌మెంట్..

భారీ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన హోంబలే ఫిల్మ్స్ మరో పవర్‌ఫుల్ అప్‌డేట్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. గతంలో విడుదలైన 'మహావతార్: నరసింహ' ఘన విజయం సాధించిన తర్వాత, అదే ఫ్రాంచైజీలో భాగంగా రెండో చిత్రం 'మహావతార్ పరశురామ్' టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. హోంబలే ఫిల్మ్స్, క్లీమ్ ప్రొడక్షన్స్ కలిసి శ్రీమహావిష్ణువు దశావతారాల ఆధారంగా ఏడు చిత్రాలను రూపొందిస్తున్న విషయం తెలిసిందే. 2025లో 'నరసింహ'తో ప్రారంభమైన ఈ ప్రయాణం, ఇప్పుడు పరశురాముడి అవతారంతో కొనసాగుతోంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను 2027 డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ప్రకటన సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. "ధర్మం క్షీణించినప్పుడు పరశు లేస్తుంది" అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పరశురాముడి శక్తివంతమైన రూపాన్ని ప్రతిబింబించేలా దీన్ని డిజైన్ చేసినట్టు తెలుస్తోంది. దర్శకుడు అశ్విన్ కుమార్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రభావవంతంగా తెరకెక్కిస్తున్నారు. కేవలం పిల్లలకే కాకుండా, అన్ని వయసుల ప్రేక్షకులను ఆకట్టుకునేలా అంతర్జాతీయ స్థాయి విజువల్స్‌తో రూపొందిస్తున్నారు. ప్రస్తుతం హోంబలే ఫిల్మ్స్ చేతిలో 'కాంతార: చాప్టర్ 1', 'సలార్ 2' వంటి భారీ ప్రాజెక్టులు ఉన్నప్పటికీ, ఇలాంటి పౌరాణిక యానిమేషన్ సినిమాలను కూడా సమాంతరంగా తీసుకురావడం విశేషం. ఈ చిత్రానికి సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తుండగా, 'మహావతార్ పరశురామ్' కూడా ప్రేక్షకులకు విజువల్ వండర్‌గా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# 'వాల్మీకి రామాయణం'కు ఇళయరాజా సంగీతం

## ఆధ్యాత్మిక స్పర్శతో భారీ ప్రాజెక్ట్



అమోఘమైన స్వరాలతో తరతరాలను అలరించిన ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా, మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సిద్ధమయ్యారు. బాలీవుడ్‌లో రూపొందుతున్న భారీ చిత్రం 'వాల్మీకి రామాయణం'కు ఆయన సంగీతాన్ని అందించనున్నారు. ఈ విషయాన్ని స్వయంగా ఆయన సోషల్ మీడియా ద్వారా వెల్లడిస్తూ, ఇది తనకు ఎంతో ప్రత్యేకమైన ఆధ్యాత్మిక అనుభవమని తెలిపారు. సంగీతాన్ని భగవంతుడికి సమర్పించే నైవేద్యంగా భావిస్తున్నానని ఆయన వ్యాఖ్యానించారు. రామాయణం వంటి మహత్తర ఇతిహాసానికి ఇళయరాజా స్వరాలు జోడవడం సంగీత ప్రేమికులకు ప్రత్యేకమైన ఆనందాన్ని కలిగిస్తోంది. ఆయన అందించే నేపథ్య సంగీతం ఈ చిత్రాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ చిత్రాన్ని దర్శకురాలు భావనా తల్వార్ అత్యంత నిబద్ధతతో తెరకెక్కిస్తున్నారు. వాల్మీకి మహర్షి రచించిన అసలు రామాయణాన్ని ఆధారంగా చేసుకుని, ఎటువంటి మార్పులు చేయకుండా నిజస్వరూపానికి దగ్గరగా ఈ సినిమాను రూపొందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. ప్రతి ఘట్టాన్ని సహజంగా, స్పష్టంగా చూపించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇప్పటి కాలంలో పౌరాణిక కథలను కమర్షియల్ హంగులతో మార్చడం సాధారణంగా మారుతున్న వేళ, ఈ చిత్రం మాత్రం మూల కథకు కట్టుబడి ఉండటం ప్రత్యేకతగా నిలుస్తోంది. 2026 అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దేశవ్యాప్తంగా పలు రామాయణ ప్రాజెక్టులు రూపొందుతున్నప్పటికీ, ఇళయరాజా సంగీతం మరియు ఒరిజినల్ కథనం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని తెరపై చూడటానికి రామభక్తులు, సంగీతాభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com